సాక్షి

# అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 14 । డిసెంబర్ । 2022



## ఆట పాటలతో అదరగొట్టారు



- నందడిగా జగనన్న స్వర్ణోత్సవాలు
- కళాకారులతో కలిసి డ్యాన్స్ చేసిన మంత్రి రోజా

IIలో

## మళ్లీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. మంగళవారం పాడేరు మండలం మినుములూరులో 14 డిగ్రీలు, అరకులోయలో 15.2 డిగ్రీలు, చింతపల్లిలో 16.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10గంటల వరకుమంచు తెరలు వీడలేదు.

## చెరువులు, మట్టి రోడ్లకు ప్రాధాన్యం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ రమేష్ రామన్

IIలో

## న్యూస్‌రీల్

### శ్రీహరికోటను సందర్శించిన గిరిజన విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్పేస్ సెంటర్ ఇంజినీర్

సాక్షి, పాడేరు: పాడేరు నుంచి వెళ్లిన 127 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించారు. వీరికి స్పేస్ సెంటర్ ఇంజినీర్లు అతిథి గృహంలో 20 గదులు కేటాయించారు. విద్యార్థులకు రాకెట్ లాంచింగ్ ప్యాడ్‌లను చూపించి ఆడోటోరియంలోని రాకెట్స్ తయారీ, పని చేసే విధానాలను స్పేస్ సెంటర్ డైరెక్టర్ మురళీకృష్ణ వివరించారు. ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ సూచనల మేరకు అటవీ శాఖాధికారులు కూడా స్పందించి నేలపట్టు పక్షి సంరక్షణ కేంద్రాన్ని చూపించారని చింతపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రామరాజు పడాల్ ఫోన్లో తెలిపారు. అయనతో పాటు పాడేరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్ఎం గంగాభవాని, గుత్తులపుట్టు పాఠశాల హెచ్ఎం సింహాచలం, పీడీలు కె. రామకృష్ణ, బి. హేమ, కే. కుమారి, ఏఎస్ఎం కె. లలిత పాల్గొన్నారు.

### కోడి పందాల శిబిరంపై దాడి

**41 మందిపై కేసు**

దేవీపట్నం: కోడిపందాల శిబిరంపై దాడి చేసి 41 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు. దేవారం పంచాయతీ ముసుళ్లకుంట సమీపంలో సోమవారం అర్ధ రాత్రి కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం ఏఎస్పీ అధారాజ్‌సింగ్ రాణాకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు రంపచోడవరం సీఐ జి. సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి దాడిచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో 8కార్లు, ఏడు పందెం కోళ్లు, రూ.1.31లక్షల నగదు స్వాధీనం చేసుకుని 41 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఇద్దరు శిశువుల మృతి



మృతి చెందిన శిశువు

జి.మాడుగుల: మండలానికి చెందిన ఇద్దరు మగ శిశువులు పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందారు. భీరం పంచాయతీ వనెల్ల గ్రామానికి చెందిన సాగిన రవిబాబు, మణి దంపతులకు చెందిన మూడు నెలల మగ శిశువు అనారోగ్యానికి గురి కావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొద్ది గంటల తరువాత గెమ్మెలి పంచాయతీ కూనేటి గ్రామానికి చెందిన శోభ మత్స్యకొండమ్మ, నాగేశ్వరరావు దంపతులకు చెందిన మూడు నెలల మగశిశువు కూడా అదేవిధంగా ఆస్పత్రిలో మృతి చెందాడు. శ్వాస సంబంధిత వ్యాధితో ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్టు వారి తల్లిదండ్రులు తెలిపారు.

### మాతాశిశు మరణాల నిరోధమే లక్ష్యం

**డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా**



వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: జిల్లాలోని మాతాశిశు మరణాల నిరోధమే లక్ష్యంగా వైద్యబృందాలు శ్రమించి పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా ఆదేశించారు. తన కార్యాలయంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గ్రామాల్లో గర్భిణి దశ నుంచి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. రక్తహీనత సమస్య ఉంటే వారి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని, రక్తహీనత నివారణ మందులు వాడించడంతోపాటు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. బాల్య వివాహల జోలికి పోకుండా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను విజయవంతంగా నిర్వహించాలని, నెలలు నిండిన గర్భిణులను సకాలంలో దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించాలని ఆదేశించారు. రిస్క్ కేసులను ఏడు నుంచి 15 రోజుల ముందే బర్త్ వెయిటింగ్ గదులకు చేర్చి మెరుగైన వైద్యసేవలు కల్పించాలని ఆయన సూచించారు. డీఐవో డాక్టర్ ప్రభావతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకాంక్షలు నెరవేరేలా..

**కొత్త జిల్లాగా ఆవిర్భవించిన నేపథ్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వనరులు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆకాంక్షల (యాస్పిరేషనల్) జిల్లాల జాబితాలో అవకాశం దక్కడంతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెచ్చించనున్నందున సమగ్ర గిరిజనాభివృద్ధికి దోహదపడుతుంది.**

- యాస్పిరేషనల్ జాబితాలో జిల్లాకు స్థానం
- కేంద్రం సహకారంతో మెరుగుపడనున్న వసతులు
- విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం
- పేదరిక నిర్మూలనకు సహకారం
- సమగ్ర గిరిజనాభివృద్ధికి దోహదం



ఉమ్మడి విశాఖ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన జామిగుడ రోడ్డు



అభివృద్ధికి నోచుకోనున్న దల్లాపల్లి ఆదివాసీ గ్రామం

సాక్షి,పాడేరు: కేంద్రప్రభుత్వం వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి 2018లో ఆకాంక్షల (యాస్పిరేషనల్) జిల్లాల వ్యవస్థను ప్రారంభించింది. ఇప్పుడు ఆ పథకం కొత్తగా ఆవిర్భవించిన జిల్లాకు వరంగా మారనుంది. గతంలో ఉమ్మడి విశాఖ యాస్పిరేషనల్ జిల్లాగా ఉండేది. గిరిజన ప్రాంతాలతో ఉమ్మడి విశాఖ ఉండడంతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి పలు పథకాల ద్వారా నిధులు మంజూరు చేసేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేసింది. రంపచోడవరం, అరకులోయ, పాడేరు నియోజకవర్గాల పరిధి లోని 22 మండలాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం విలీన మండలాలకు సంబంధించి చింతూరు కేంద్రంగా కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేసింది. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి కట్టుబడి అన్ని సంక్షేమ పథకాలను ఆమలుజేస్తున్నారు.

**జిల్లా మరింత అభివృద్ధి**

కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షల జిల్లాగా ప్రకటించడంతో రానున్న రోజుల్లో సమగ్ర అభివృద్ధికి మార్గం ఏర్పడింది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో సుమారు 25శాతం మారుమూల గ్రామాలకు రోడ్డు,రవాణా అభివృద్ధి జరగలేదు. గతంలో మావోయిస్టుల హెచ్చరికలతో వారి ప్రభావిత ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయతీ కేంద్రాల నుంచి మారుమూల గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖల ద్వారా రోడ్లు, గెడ్డలపై వంతెన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆకాంక్షల జిల్లాగా కేంద్రం ప్రకటించడంతో గతంలో విశాఖ ఉమ్మడి జిల్లాకు అమలుజేసిన అన్ని కేంద్ర సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో 90శాతం జనాభా గిరిజనులే కావడంతో సమగ్ర గిరిజనాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయనున్నాయి.

**జిల్లా సమాచారం**

| | | |
|---|---|---|
| జిల్లాలో మండలాలు | : | 22 |
| ఐటీడీఏలు | : | 3 |
| రెవెన్యూ డివిజన్లు | : | 3 |
| పంచాయతీలు | : | 430 |
| రెవెన్యూ గ్రామాలు | : | 2,972 |
| జనాభా | : | 10.82 లక్షలు |

**విద్య,వైద్యం, మౌలిక సదుపాయాలు..**

యాస్పిరేషనల్ జిల్లాలో కేంద్రం విద్య, వైద్యం.ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అలాగే రెండవ ప్రాధాన్యత క్రమంలో వ్యవసాయం, ఉపాధి అవకాశాలకు తగిన ప్రోత్సాహం ఇస్తుంది. పేదరిక నిర్మూలన కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఆమలుకానున్నాయి. అభివృద్ధిలో వెనుకబడిన అన్ని గ్రామాలకు ప్రత్యేక నిధులు వెచ్చిస్తారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నాయి.

**జిల్లా ప్రజలకు ఎంతో మేలు**



గిరిజన భూభాగం మొత్తం విస్తరించిన అల్లూరి సీతారామరాజు జిల్లా అభివృద్ధిలో పరుగులు పెట్టేందుకు యాస్పిరేషనల్ జిల్లాగా గుర్తింపు ఎంతో మేలు జరుగుతుంది. అన్ని సంక్షేమ కార్యక్రమాలకు నిధులు మంజూరవుతాయి. విద్య, వైద్యం,మౌలిక సదుపాయాలకు నోచుకోని మారుమూల గ్రామాలకు ప్రణాళిక పరంగా న్యాయం జరుగుతుంది. మాతాశిశు ఆరోగ్యం, సంక్షేమం, వైద్య ఆరోగ్య సేవలు విస్తరణ, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలవుతాయి.

–బి.దయానిధి, జిల్లా రెవెన్యూ అధికారి

## నేడు విశాఖలో సీఎం ట్రాన్సిట్ హాల్ట్



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.మల్లికార్జున, సీపీ శ్రీకాంత్, ఇతర అధికారులు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం విశాఖపట్నం రానున్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పెద్ద కుమారుడి వివాహానికి సీఎం హాజరుకానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి 3.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 3.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి దాకమర్రిలోని రఘు ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఎన్‌సీసీ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 3.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ 3.50 గంటల వరకూ ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి సాయంత్రం 4 గంటలకు వివాహ వేదిక రఘు ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోనున్నారు. వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీర్వదించనున్నారు. అనంతరం 4.20 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 15 నిమిషాల పాటు స్థానిక నేతలతో ముచ్చటించనున్నారు. 4.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు రానున్నారు. ఇక్కడి నుంచి సాయంత్రం 5.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు ప్రయాణం కానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు, హెలిప్యాడ్ స్థలాన్ని కలెక్టర్ డా.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్, ఇతర అధికారులు మంగళవారం పరిశీలించారు.

## స్పందన వినతులపై ప్రత్యేక శ్రద్ధ

- మ్యుటేషన్‌లో నిర్లక్ష్యం వద్దు
- ఐటీడీఏ పీవోలు గిరిజన విద్యాలయాల సందర్శన తప్పనిసరి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



అధికారులతో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్పందన కార్యక్రమంలో స్వీకరించిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.తన కార్యాలయం నుంచి జిల్లాలోని మూడు ఐటీడీఏల అధికారులు, అన్ని మండలాల అధికార యంత్రాంగంతో వీడియో సమావేశాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన వినతులను రిజిస్టర్‌లో నమోదు చేసి,ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. వీఆర్వోలు సచివాలయాలకు హాజరుకావాలని, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో రాకపోకల సమయాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్‌తో పాటు, ధ్రువపత్రాల జారీలో రెవెన్యూ యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడాలని, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.13 కోట్లు విడుదల అయ్యాయన్నారు. వీటిలో 50శాతం నిధులను పారిశుధ్య కార్యక్రమాలకు వినియోగించాలని ఆయన సూచించారు. ప్రతి పంచాయతీ నుంచి రూ.2వేలు ఎంపీడీవోకు బదలాయిస్తే మండలానికి రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని చెత్తచెదారం తొలగింపు పనులు చేపట్టడమే కాకుండా అదనంగా పారిశుధ్య పనివారను నియమించుకోవాలన్నారు. జిల్లాకు మరో 32మంది పంచాయతీ కార్యదర్శులు రానున్నట్టు చెప్పారు. ఐటీడీఏ పీవోలు నెలకు ఐదు గిరిజన విద్యాలయాలను సందర్శించి నివేదికలు పంపాలని సూచించారు.విద్యార్థుల హాజరు, మెనూ అమలు, నాణ్యమైన పౌష్టికాహార పంపిణీని పరిశీలించాలని ఆదేశించారు. ఏటీడబ్ల్యూవోలు,ఎంఈవోలు,ఎంపీడీవోలు కూడా తప్పనిసరిగా పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు ఆశించినస్థాయిలో లేవని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

- ఉదయం 11 గంటలైనా విధులకు హాజరుకాని వైనం
- ఆకస్మిక సందర్శనతో అధికారుల్లో గుబులు



దుంబ్రిగుడ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

దుంబ్రిగుడ: సకాలంలో రెవెన్యూ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ఉదయం 11 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడంతో వారి విధి నిర్వహణ తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత సిబ్బంది ఒకొక్కరు విధులకు హాజరయ్యారు. సిబ్బందితో మాట్లాడిన తర్వాత స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. గిరిజనులకు అందుతున్న వైద్యంపై అక్కడి వైద్యాధికారి పి. రాంబాబు నుంచి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. శిథిలస్థితికి చేరిన భవన మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.చాపరాయి జలపాతం వద్ద పారిశుధ్యం నిర్వహణకు రూ.లక్ష మంజూరు చేసినట్టు ఆయన వివరించారు. కార్యదర్శుల కొరత పరిష్కారానికి అనకాపల్లి జిల్లా నుంచి డిప్యుటేషన్‌పై నియమించేలా చర్యలు తీసుకోవాలని ఇరు జిల్లాల డీపీవోలను ఫోన్లో ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల గదిని పరిశీలించారు. ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో పంపిణీ చేస్తున్న మందులను జాగ్రత్తగా చాలని సిబ్బందికి సూచించారు. ఇద్దరు వైద్యాధికారులుండగా మరొక వైద్యాధికారి విధులకు ఎందుకు హాజరు కాలేదని కలెక్టర్ ప్రశ్నించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బిల్లాపుట్టు గ్రామంలో పాల్గొన్నారని సిబ్బంది తెలిపారు. దీంతో ఆయన అక్కడికి వెళ్లి వైద్యాధికారి హాజరయ్యారా లేదా అనే దానిపై పరిశీలించారు. అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కలెక్టర్ ఆకస్మాత్తుగా మండల కేంద్రంలో పర్యటించడంతో మండలస్థాయి అధికారులతో పాటు కింద స్థాయి సిబ్బంది గుండెల్లో దడ పుట్టింది. సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనే దానిపై వేచి చూడాల్సిందే.

పర్యటనలో భాగంగా బిల్లాపుట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పౌష్టికాహారం పంపిణీ, నిర్వహణ తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ



కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న డీఈవో రమేష్

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి ఎయిడెడ్, కేజీబీవీ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎయిడెడ్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలను ప్రభుత్వం విలీనం చేసిందన్నారు. పాఠశాల భవనానికి సంబంధించిన వ్యాల్యూ ఎస్టిమేషన్ పత్రాన్ని సమర్పించాలని పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమోహన్ సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలను అడిగారు. పాఠాలు బోధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వీవీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని 2022– 2023 విద్యా సంవత్సరానికిగాను ఖాళీగా ఉన్న టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల, కళాశాల కన్వీనర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అహ్మద్ ఆలీషా తెలిపారు. పీజీ, బీఈడీ, మరియు టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అయితే గతంలో దరఖాస్తు చేసినవారు, కొత్తగా దరఖాస్తులు చేసుకునేవారు ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ నిమిత్తం రావాలని ఆయన సూచించారు. అన్ని పోస్టులకు సంబంధించి అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

## కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న పోలీసులు

ఎటపాక: మద్యం, నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఎటపాక, మోతుగూడెం పోలీసుస్టేషన్ల పరిధిలో పట్టుబడిన 35 వాహనాలకు ప్రభుత్వ ధర నిర్ణయించిన అనంతరం చింతూరు ఏఎస్పీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వీటిలో 29 వాహనాలను వేలంలో దక్కించుకున్నారని సీఐ గజేంద్రకుమార్ తెలిపారు.

**పాడేరులో 17న...**

పాడేరు రూరల్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు ఈనెల 17న ఉదయం 10 గంటలకు పాడేరు ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పాడేరు సీఐ సంతోష్ తెలిపారు. 14న ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలకు వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గలవారు రూ.5వేలు సొమ్మును డిపాజిట్ చేసి తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. బహిరంగ వేలంలో వాహనాలకు దక్కించుకున్నా వారు అదేరోజు జీఎస్టీతో వేలంలో పాడిన సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## సాంకేతిక విద్యతోనే ప్రగతి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న నాగరాణి

**టెక్నికల్ విద్య డైరెక్టర్ చదలవాడ నాగరాణి**

రంపచోడవరం: ఏజెన్సీలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను పాలిటెక్నిక్‌లో చేరే విధంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర పాలిటెక్నిక్, టెక్నికల్ విద్య డైరెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం పీవో సూరజ్ గనోరేతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఐటీడీఏ పరిధిలో 2014లో పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాంకేతిక విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువతను సాంకేతిక విద్య వైపు వెళ్లే విధంగా చైతన్యం తీసుకురావాలని సూచించారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో కొన్ని కోర్సులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం గుర్తించడం జరిగిందని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన తరువాత పాలిసెట్‌కు దరఖాస్తు చేసేవిధంగా హెచ్ఎంలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఏజెన్సీలోని ప్రతి పాఠశాలలో 8,9వ తరగతి విద్యార్థులకు లెక్కలు, ఫిజిక్స్ సబ్జెక్టులపై దృష్టి పెట్టే విధంగా బోధించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మోడల్ సాంకేతిక రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలు తొమ్మిది ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాలిటెక్నిక్‌లో 22 కోర్సులు ఉన్నట్లు తెలిపారు. గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన సమయంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు పునాది, భవిత ప్రోగ్రామ్‌లు నిర్వహించినట్లు గుర్తు చేశారు.పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని యువతకు ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించేందుకు మూడుసార్లు జాబ్ మేళాలు నిర్వహించామన్నారు.300 మంది యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ విద్య డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ డెవలప్‌మెంట్ అధికారి మురళి, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, హాసిని, ఎంఈవోలు సత్యనారాయణ, తాతబ్బాయిదొర, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీల విజేత చింతూరు



విజేతలకు షీల్డ్ అందచేస్తున్న అసిస్టెంట్ ఎంవీఐ జగదీష్

**చింతూరు:** మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చింతూరు జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలో చింతూరు ఎఫ్‌వైఏసీ, రామవరం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన చింతూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 120 పరుగులు చేయగా అనంతరం రామవరం జట్టు 13 ఓవర్లలో 67 పరుగులకు ఆలౌటైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ ఎంవీఐ జగదీష్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో తోడ్పాతాయన్నారు. క్రీడల ద్వారా యువతకు ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, యువత గ్రామస్థాయి నుంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విన్నర్స్, రన్నర్స్ జట్లకు షీల్డ్‌లతో పాటు నగదు బహుమతిని అందించారు. నెలరోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్లో 80 జట్లు పాల్గొనగా మ్యాన్ ఆఫ్ ది సీరీస్‌గా గౌతమ్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రాము నిలిచారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, దుర్గ, సూరి, అజయ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరికి గాయాలు
- కాంట్రాక్టు ఉద్యోగి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నాగం నాయుడు

**చింతపల్లి:** మండల కేంద్రంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడ్డ వారిలో బెన్నవరం జీసీసీ డిపోలో కాంట్రాక్టు సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న సాలబం నాగంనాయుడు(46) పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స తరువాత విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి తరలిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగంనాయుడు జీసీసీ గోదాములో సరుకులు విడిపించుకునేందుకు ద్విచక్ర వాహనంలో చింతపల్లి వచ్చారు. అక్కడ నుంచి పాతబస్టాండ్‌కు వెళుతూ మార్గమధ్యంలో పండ్ల దుకాణం వద్ద ఆగేందుకు కుడివైపు చేయి ఊపుతూ నెమ్మదిగా వాహనాన్ని తిప్పుతుండగా ఎదురుగా వేగంగా వస్తున్న మరో వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర రక్త స్రావం జరగడంతో అతని పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. ఢీ కొట్టిన వాహనంలో సప్పర్లకు చెందిన సంతోష్(26) స్వల్పంగా గాయపడ్డాడు. అతను స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాద సంఘటనపై సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆట పాటలతో అదరగొట్టారు

- సందడిగా జగనన్న స్వర్ణోత్సవాలు
- కళాకారులతో కలిసి డ్యాన్స్ చేసిన మంత్రి రోజా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గొలగాని వెంకట కుమారి



సాంస్కృతిక పోటీలో నృత్య వైభవం

**బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు):** రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఏరీనాలో మంగళవారం జోనల్‌స్థాయి జగనన్న స్వర్ణోత్సవాలు సందడిగా సాగాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా విజయనగరం జిల్లా వెంపాడ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి ఐదు నిమిషాల పాటు నృత్యం చేసి కళాకారులను ఉత్సాహపరిచారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని మేయర్ గొలగాని హరివెంకట కుమారి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మన కళలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కళలను పరిరక్షించేందుకు సాంస్కృతిక శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలను ఉపయోగించుకోవాలని కోరారు. జోనల్‌స్థాయికి చేరుకున్న కళాకారులు మరింత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, ముఖ్య కార్యదర్శి మల్లికార్జునరావు, సినీ దర్శకుడు ఆర్.కె.సెల్వమణి పాల్గొన్నారు.

**అలరించిన కళా ప్రదర్శనలు**

ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులు నృత్యాలు, పాటలు, బుర్ర కథలతో ప్రేక్షకులను అలరించారు. థింసా, కోలాటం, పులివేషం, భరత నాట్యం, తప్పెటగుళ్లు, బుర్ర కథ తదితర కళారూపాలను 17 బృందాలు ప్రదర్శించాయి. సోలోగా ఇద్దరు పులివేషాలతో అలరించారు. గాత్రం(ఫోక్ సాంగ్, లైట్ మ్యూజిక్, హిందూస్థానీ) విభాగంలో 34 మంది శ్రావ్యంగా పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులకు మంత్రి రోజా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

# అభ్యంతరాలపై త్వరలో విచారణ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు



గ్రామసభలో అభ్యంతరాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు

**చింతూరు:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చింతూరులో ముంపునకు గురవుతున్న ఇళ్లకు సంబంధించివచ్చిన అభ్యంతరాలపై త్వరలోనే విచారణ నిర్వహిస్తామని పోలవరం భూ సేకరణ కార్యాలయం చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా చింతూరులో 1445 ఇండ్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీనికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలని రెండు నెలల క్రితం నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఆ గడువు ముగియడంతో తిరిగి గ్రామసభ నిర్వహించామని, ఇప్పటివరకు వివిధ కారణాలతో 424 అభ్యంతరాలు వచ్చాయని ఆయన వివరించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి వాటిపై విచారణ నిర్వహించి తిరిగి నోటిఫికేషన్ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం ముత్తమ్మ, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు విజయకుమారి, తులసి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, వీఆఆర్వో రామచంద్రం పాల్గొన్నారు.

## పులి సంచారంపై వదంతులు

**గొలుగొండ:** చిన్నయ్యపాలెం గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పులి సంచరించిందనే ప్రచారం జరిగింది. తాండవ జలాశయం ఆనుకొని పాడి గేదెలను మేతకు తీసుకువెళ్లిన చిన్నయ్యపాలెం మహిళలకు పులితో పాటు చిన్న పిల్ల కనిపించిందన్న ప్రచారం జోరుగా సాగింది. పశువులు కాస్తున్న మహిళలు దూరం నుంచి చూశారని చెబుతున్నారు. తాండవ జలాశయం ఆనుకొని ఉండడం వల్ల అది ఎటు వెళ్లిపోయిందో తెలియని చెబుతున్నారు. అయితే ఇక్కడ పులి సంచారానికి అవకాశం లేదని, ఫారెస్టు సర్వే ప్రకారం ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు పులి ఉందనే సమాచారం రికార్డుల్లో లేదని అటవీశాఖ అధికారులు తెలుపుతున్నారు. తాండవ జలాశయాన్ని ఆనుకొని ఉన్న కొండల్లో బరుకుపిల్లి సంచారం అధికంగా ఉంటుందని చెబుతున్నారు. చేపలు తినడానికి కొండల నుంచి బరుకుపిల్లి వచ్చినపుడు దానిని చూసి పులి అని పొరబడే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌ను సాక్షి సంప్రదించగా పులి సంచారం వట్టి పుకారేనని, ప్రజలు భయపడరాదని అన్నారు.

## చెట్టు మీద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

**మారేడుమిల్లి:** చెట్టు మీద పడి ఓ గిరిజనుడి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి మంగళవారం మధ్యాహ్నం సమయంలో రామన్నవలస గ్రామ అడవీ సమీపంలో కట్టెల కోసం చెట్టు నరుకుతుండగా ప్రమాదవశాత్తూ అదే చెట్టు అతని కాళ్ల మీద పడింది. దీంతో అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. గాయపడిన అతనిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవలు కోసం రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# చెరువులు, మట్టి రోడ్లకు ప్రాధాన్యం

డ్వామా పీడీ రమేష్ రామన్

**కూనవరం:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఈఏడాది సామాజిక చెరువులు, మట్టిరోడ్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా పీడీ) రమేష్ రామన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో మాట్లాడారు. మండల కేంద్రంలో 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో రూ.20.10 కోట్లతో చేపట్టిన 1200 పనులపై సుమారు 20 రోజులు సామాజిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా సామాజిక చెరువులు, చిన్న నీటి కుంటలకు, మట్టి రోడ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతీ కుటుంబానికి వంద రోజులు పనిదినాల చొప్పున రెండు లక్షల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. అన్ని కుటుంబాలకు నెలసరి వేతనం రూ.257 అందించాలని, తడిచెత్త, పొడిచెత్తకు సంబంధించిన సంపద కేంద్రాలను అన్నిచోట్ల వినియోగంలోకి తెచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ మస్తర్లు క్రమసంఖ్యలో ఉండాలని, కొట్టివేతలు ఉంటే సహించేది లేదన్నారు. కొట్టివేతలను గుర్తించిన ఆయన రూ.15 వేల రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చింతూరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోషయ్య, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్సు పర్సన్ రాజేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఫణీందర్, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు

**అడ్డతీగల:** అడ్డతీగల శివారున టేకు ప్లాంటేషన్ వద్ద మంగళవారం రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన పులవర్తి సత్యనారాయణ, సోమేశ్వరంకి చెందిన సూర్యనారాయణ, అడ్డతీగల మండలం నాయుడు పాకలకు చెందిన ఎం.సురేష్‌తో కలిసి అడ్డతీగల వైపు వస్తుండగా రాజవొమ్మంగి మండలం అనంతగిరికి చెందిన వాసా సునీల్ అనే వ్యక్తి అడ్డతీగల నుంచి వేటమామిడి వైపు వెళ్తుండగా అదుపుతప్పి రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సత్యనారాయణ, సూర్యనారాయణకు ఎడమకాళ్లు విరిగిపోయాయి. వాసా సునీల్ తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. నాయుడుపాకలకు చెందిన సురేష్ స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కాకినాడ సామాన్య ఆస్పత్రికి రిఫర్ చేశారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# దివ్యాంగుల సంక్షేమానికి కృషి



సంస్థ ప్రతినిధులతో ఎంపీ మాధవి

**కొయ్యూరు:** దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆలింకో సంస్థ గిరిజన ప్రాంతాల్లో కూడా తమ సేవలను అందించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఢిల్లీలో మంగళవారం ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అందిస్తున్న సేవలపై సంస్థ ప్రతినిధులను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ ఆలింకో సంస్థ ప్రతినిధులు మన్యంలో వారి సేవలను విస్తృతం చేయాలని కోరినట్టు తెలిపారు. గిరిజన దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరామన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# భూ రీసర్వే పరిశీలన



భూ రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ శివ శ్రీనివాస్

**అనంతగిరి:** మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలోని పందిరిమామిడివలస, పల్లంవలస గ్రామాల్లో చేపడుతున్న భూ రీసర్వేను జేసీ శివ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా జరిగిన భూ రీసర్వే వివరాలను తహసీల్దార్ రాంబాయిని జేసీ అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మండలంలోని 284 గ్రామాల్లో భూ రీసర్వే గాను, 15 గ్రామాలు పూర్తి చేసినట్టు తహసీల్దార్ వివరించారు. మిగిలిన గ్రామాల్లో త్వరితగతిన భూ రీ సర్వే పూర్తిచేయాలని జేసీ శివ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- నంగులోయలో మెగా వైద్య శిబిరం
- 600 మందికి వైద్య పరీక్షలు, మందులు పంపిణీ
- గిరిజనులకు సీఐ సత్యనారాయణ సూచనలు



శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శశికాంత్

**జి.మాడుగుల:** ఏజెన్సీల్లో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా వైద్యశిబిరాలు, సేవా కార్యక్రమాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో లువ్వాసింగి, సంగులోయ గ్రామంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంజీవని మెగా మెడికల్ క్యాంప్ జరిగింది. శిబిరాన్ని సీఐ, ఎస్ఐలు ప్రారంభించారు. సీఐ, ఎస్‌లు ముందుగా ప్రొత్సాహక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య భద్రత పాటించాలన్నారు. 12 గ్రామాల నుంచి సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విశాఖపట్నం అమృత హృదయ ట్రస్టు, విశాఖ ఐ ఆస్పత్రి, జి.మాడుగుల పీహెచ్‌సీ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పది మందికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం విశాఖపట్నం ఐ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు కె.సుబ్బలక్ష్మి, కె.రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, అమృత హృదయ ట్రస్టు సీఈవో ప్రకాష్, డాక్టర్ చలపతి, నాయకులు బాలన్న, సూర్యప్రకాష్, గణపతి, చినమత్స్యకొండబాబు, చంద్రకళ, ప్రకాష్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీశ్రేణులు సమష్టిగా పనిచేయాలి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



**సీలేరు:** రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం సీలేరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజారిటీ వస్తుందన్నారు. పార్టీశ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేశారన్నారు. విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమచేస్తోందన్నారు. దీంతో ప్రజల ఆర్థికాభివృద్ధి జరుగుతోందన్నారు. పార్టీ శ్రేణులంతా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై గ్రామాల్లో విస్తృతం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యావ్యవస్థ మరింత బలోపేతం

- అన్నిరంగాలు ఇంజినీరింగ్ విద్యపై ఆధారపడి ఉన్నాయి
- సీడీఈ రాష్ట్ర చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంకుమార్

**అనకాపల్లిటౌన్:** ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగానే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థను ఏర్పాటు చేసినట్టు సీడీఈ రాష్ట్ర చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో రెండో రోజైన మంగళవారం వైబ్రంట్ డైట్-2022 వారోత్సవ వేడుకలు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అన్ని రంగాలు ఇంజినీరింగ్ వ్యవస్థపై ఆధారపడి ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్స్) కె.వి.రావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకు విదేశాల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా వారివారి లక్ష్యాలను ఎంపిక చేసుకొని దానికనుగుణంగా విద్యనభ్యసించినట్టయితే విదేశాలలో ఎదుగుదల కనిపిస్తుందన్నారు. కళాశాల ఆవరణలో వివిధ ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నేపథ్య గాయకుడు, సరిగమప విజేత కె.యశస్వీ బృందం ఆలపించిన గీతాలు, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 80, 81 కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చోడవరంలో ఇద్దరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇద్దరు టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

**చోడవరం:** చోడవరం పట్టణానికి చెందిన ఇద్దరు తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వీరు వైఎస్సార్‌సీపీ కండువా వేసుకొని పార్టీలో చేరారు. చోడవరం మాజీ పట్టణ అధ్యక్షుడు గూనూరు చిన అచ్చిబాబు, కేశవ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అలమండ బంగారయ్య తెలుగుదేశం పార్టీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందని ధర్మశ్రీ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని, అందుకే పనిచేసే పార్టీలో తాము సైనికులుగా పనిచేయాలని భావించి వైఎస్సార్‌సీపీలో చేరామని చిన అచ్చిబాబు, బంగారయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.